


దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 127 శనివారం 10-05-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 7 వెల : 5 రూ/..



వరుసగా రెండో రోజూ పాక్ డ్రోన్ దాడులు

కశ్మీరు నుంచి కచ్ వరకూ 20 నగరాలు లక్ష్యంగా..

నాలుగు రాష్ట్రాల్లో 26 డ్రోన్లు.. కూల్చివేసిన భారత సైన్యం

డ్రోన్ దాడికి ఫిరోజ్‌పూర్‌లో ముగ్గురికి గాయాలు.. ఒకరు విషమం

సరిహద్దు ప్రాంతాల్లో రెండో రోజూ సైరన్ మోతలు, చిమ్మ చీకట్లు

# ఉద్రిక్తంగానే..



**జమ్మూ, శ్రీనగర్, అమృత్‌సర్, మే 9:** భారత్, పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో వరుసగా రెండో రోజు కూడా ఉద్రిక్త పరిస్థితులే కొనసాగుతున్నాయి. జమ్మూ కశ్మీరు నుంచి గుజరాత్ వరకూ సైరన్ మోతలు వినిపిస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్, జోధ్‌పూర్ సహా జమ్ము నుంచి పంజాబ్ వరకూ చాలా ప్రాంతాల్లో బ్లాకవుట్ కొనసాగుతోంది. ఇళ్లల్లోనూ బయటా లైట్లు ఆర్పేయడంతో చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అదే సమయంలో, పాకిస్థాన్ తన దుర్బుద్ధిని పోనిచ్చుకోలేదు. జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌ల్లోని 20 నగరాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని శుక్రవారం రాత్రి కూడా పాకిస్థాన్ డ్రోన్ దాడులు చేసింది. మరోసారి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది. బారాముల్లా నుంచి భుజ్ వరకూ నాలుగు రాష్ట్రాల్లో 26 డ్రోన్ దాడులు చేసింది. వాటన్నిటినీ భారత్ అడ్డుకుని కూల్చేసింది. వీటిలో శ్రీనగర్ విమానాశ్రయం, దక్షిణ కశ్మీరులోని అవంతిపుర స్థావరమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సమర్థంగా అడ్డుకుంది. అయితే, అవంతిపుర వైమానిక స్థావరం చుట్టుపక్కల పేలుళ్లు వినిపించాయి. పాకిస్థాన్ డ్రోన్లను గగనతలంలోనే పేల్చేయడంతో బారాముల్లాలో ఆకాశం అరుణ వర్ణాన్ని తలపించింది.

జమ్ము కశ్మీరులోని జమ్ము, సాంబ, రాజౌరిబీ పంజాబ్‌లోని పఠాన్‌కోటబీ అమృత్‌సర్, రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌ల్లో డ్రోన్ దాడులు జరిగాయి. కుప్వారా, సాంబ, పూంచ్, యురి, నౌగమ్ హంద్వారాల్లో నియంత్రణ రేఖ వెంట భారీగా శతఘ్ని గుళ్ల వర్షం కురిపించింది. అలాగే, జమ్ము, పఠాన్ కోట్‌ల్లో రెండో రోజూ సైరన్లు వినిపించాయి. చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అమృత్‌సర్‌లో భారీగా కాల్పులు జరిగినట్లు తెలిసింది. డ్రోన్లు తిరగడం కనిపించింది. జమ్ము, కశ్మీర్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, జైసల్మేర్‌ల్లో పేలుళ్లు వినిపించాయి. పంజాబ్‌లోని గురుదాసపూర్, తరణ్ తరణ్ వాసులు కూడా తమకు పేలుళ్లు వినిపించాయని చెప్పారు. వరుసగా రెండో రోజు కూడా జైసల్మేర్‌లో డ్రోన్ దాడులను మన దళాలు అడ్డుకున్నాయి. ఇక, భారీ పేలుళ్లు తనకూ వినిపించాయని జమ్ము కశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. "అప్పుడప్పుడు భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. అవి భారీ శతఘ్నులు కావచ్చు. ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా.. ఎవరూ వీధుల్లో తిరగొద్దు. మరికొన్ని గంటలపాటు ఇళ్లల్లోనే ఉండండి. వదంతులను నమ్మొద్దు" అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## జమ్మూలో చొరబాటుకు ఉగ్రవాదుల యత్నం

**ఏడుగురిని హతమార్చిన బీఎస్ఎఫ్**



**న్యూఢిల్లీ/జమ్మూ, మే 9:** దేశంలోకి ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను బీఎస్ఎఫ్ భగ్నంచేసింది. భారత్–పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ముష్కరుల ప్రయత్నాలను అడ్డుకుని ఏడుగురిని హతమార్చడమే కాకుండా ఒక రేంజర్స్ పోస్ట్‌ను ధ్వంసం చేసినట్టు శుక్రవారం బీఎస్ఎఫ్ పేర్కొంది. సాంబ జిల్లాలో గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉగ్రవాదులకు సంబంధించిన పెద్ద గ్రూప్‌ను గుర్తించామని, అనంతరం వారి చొరబాటు చర్యలను అడ్డుకుని ఏడుగురిని మట్టుబెట్టినట్టు తెలిపింది. అలాగే పాకిస్థాన్‌లోని ధంధర్ పోస్ట్‌ను ధ్వంసం చేసినట్టు పేర్కొంది. ఈ చొరబాటు యత్నానికి పాకిస్థాన్ రేంజర్స్ పోస్ట్ నుంచి కాల్పుల మద్దతు ఉన్నట్టు వెల్లడించింది.

# మోదీ ఉన్నతస్థాయి సమావేశం

**త్రివిధ దళాధిపతులు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ**

**మాజీ అధికారులతో చర్చలు.. సరిహద్దుల్లో భద్రతపై ఆరా**

**న్యూఢిల్లీ, మే 9:**
పాక్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం రక్షణశాఖకు సంబంధించి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోభాల్, సీడీఎస్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు.. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠితో ప్రధాని భేటీ అయ్యారు. దేశ భద్రత సన్నద్ధతపై ఆరా తీశారు. భవిష్యత్తు కార్యాచరణపైనా వారితో చర్చించినట్లు సమాచారం. అంతకుముందు త్రివిధ దళాల మాజీ అధ్యక్షులు, వాటిలో పనిచేసి రిటైరయిన పలువురు సీనియర్ అధికారులతో ప్రధాని మోదీ మాట్లాడారు. వారితో కీలక విషయాలపై చర్చించారు. మరోవైపు గుజరాత్ ముఖ్యమంత్రికి ప్రధాని ఫోన్ చేశారు. సరిహద్దుల్లో ఉద్రిక్తత నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల దృష్ట్యా గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా, డ్రోన్లపై నిషేధం విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి ప్రకటించారు.



## ఆర్మీ పిలిస్తే వెళ్లి యుద్ధం చేస్తా

**గతంలో నేనూ సైన్యంలో పనిచేశా**

**మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, మే 9:** భారత్, పాకిస్థాన్ మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరిగి, ఆర్మీ తనను పిలిస్తే.. వెళ్లి యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. తాను గతంలో భారత సైన్యంలో పనిచేశానని గుర్తు చేశారు. తనకు 20ఏళ్ల వయస్సున్నప్పుడే యుద్ధ విమానానికి పైలట్‌గా పనిచేశానని ఉత్తమ్ ఈ సందర్భంగా చెప్పారు. 1982లో మిగ్–21 ఫైటర్‌కు, ఆ తర్వాత మిగ్–23కి పైలట్‌గా పని చేశానన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్ వశమైతే తప్ప కశ్మీర్ సమస్య పరిష్కారం కాదని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీకి సంబంధం లేదని అన్నారు. యుద్ధం జరిగితే పాకిస్థాన్ విచ్ఛిన్నమై పతనమవుతుందని అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి భారత సైన్యం ప్రతిదాడి సరైన చర్య అని ఉత్తమ్ పేర్కొన్నారు.

# ఎన్డీఎఫ్‌కు విరాళంగా నెల వేతనం

**ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**నేతలు, ప్రజలు విరాళాలివ్వాలని పిలుపు**



**హైదరాబాద్, మే 9 :** నేషనల్ డిఫెన్స్ ఫండ్(ఎన్డీఎఫ)కు ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టేందుకు, దేశ ప్రజల్ని కాపాడేందుకు భారత జవాన్లు చేస్తున్న పోరాటానికి చేయూతగా తన వంతు విరాళం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తన సహచరులు, కాంగ్రెస్ నాయకులు, పౌరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునకు పార్టీ నేతలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు నెల వేతనాన్ని విరాళంగా సమర్పిస్తున్నట్లు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ఈ అంశంపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతున్నారు. ఈ అంశంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ కూడా వారి ఒకరోజు వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళంగా ప్రకటించింది.

## త్వరలో 5 వేల మంది సర్వేయర్ల నియామకం



**హైదరాబాద్, మే 9:** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకుపోతున్న ప్రభుత్వం.. సర్వే విభాగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5 వేల మంది లైసెన్స్ సర్వేయర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. సచివాలయంలో శుక్రవారం సర్వే విభాగంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సర్వేయర్ల నియామకం కోసం మే 5వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైందని, ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తుకు చివరి గడువు అని చెప్పారు. మీ సేవ కేంద్రాల నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని అక్కడే సమర్పించాల్సి ఉంటుందన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు 50 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణ ఫీజు నిమిత్తం ఓసీలు రూ.10 వేలు, బీసీలు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

## ఉచితాలు ఆర్థిక వ్యవస్థకు భారం

**ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చింది**

**వనరులు, నిధుల్లేకుండా పార్టీల హామీలు**

**రిటైర్మెంట్ బెనిఫిట్లు అందలేదన్న ఓ పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యలు**

హైదరాబాద్, మే 9: ప్రభుత్వాల ఉచిత పథకాలపై రాష్ట్ర హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఎలాంటి నిధులు, ఆదాయ వనరుల్లేకుండానే ఆర్థికంగా భరించలేని ఉచిత పథకాలను రాజకీయ పార్టీలు ప్రకటించడంతో దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోందని జస్టిస్ నగేశ్ భీమపాక సారథ్యంలోని ఏకసభ్య బెంచ్ పేర్కొంది. ఉచిత పథకాల అమలుతో దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారం గురించి ప్రజలు, సభ్య సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలిపింది. 40 ఏళ్ల సర్వీసు పూర్తి కావడంతో అసిస్టెంట్ ఇంజినీర్‌గా రిటైరైన ఏ.నరేందర్‌రెడ్డి తనకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు చెల్లించడం లేదని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. పిటిషనర్‌తోపాటు రిటైరైన ఉద్యోగుల తరపు న్యాయవాదులు వాదిస్తూ.. ఉచిత పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందని ఆరోపించారు. పరిపాలన పేరుతో ఉచిత విద్యుత్, ఉచిత రవాణా, రుణ మాఫీ, రాయితీలు తదితర పేర్లతో అమలు చేస్తున్న ఉచిత పథకాలకే భారీగా నిధులు ఖర్చు చేస్తున్నదని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై మోయలేని భారం పడుతోందన్నారు. కానీ, రిటైరైన ఉద్యోగుల బెనిఫిట్లు మాత్రం చెల్లించడం లేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాజ్యాంగంలోని 226వ అధికరణం ప్రకారం.. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకునేందుకు అవకాశం లేదని, అవి న్యాయ సమీక్ష కిందకు రావని వ్యాఖ్యానించింది. అయితే, ఉచిత పథకాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారం గురించి ఆలోచిం చాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది. పిటిషనర్‌కు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్లు పది వారాల్లో చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలిస్తూ పిటిషన్ విచారణను ముగించింది. కాగా, మెడికల్ ఏజ్ ఆధారంగా వికలాంగ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ ఇచ్చి తొలగించలేరని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. సిరికొండ మల్లేశ్ సహా పలువురు వ్యక్తులు తమను ఏకపక్షంగా ప్రభుత్వం తొలగించిందని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. మెడికల్ ఏజ్ ఆధారంగా ఉద్యోగుల తొలగింపు చెల్లదని ఆదేశించింది.

# హైకోర్టు ఆర్డర్‌నే నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు..

**గెజిట్ లిస్టును తారుమారు చేసిన సాక్షి స్టాఫ్ రిపోర్టర్ బిక్షంపై చర్యలు తీసుకున్నది లేదు,బాధిత జర్నలిస్ట్ కు న్యాయం చేసింది లేదు**


**58మందికి ఉన్న అర్హతలు ఏమిటో! వి. అయోధ్య రామయ్య కు లేని అర్హత ఏమిటో,**

**మొత్తం గా హైకోర్టు లో సూక్ష్మ పరిశీలన జరిగింది, అనేక ఆసక్తికర నిజాలు వ్యక్తం అయ్యాయి**

**వాస్తవంగా గెజిట్ లిస్టులు ఒకటే ఉంటుంది కాని రెండు లిస్టులు ఉన్నాయి, ఒకటి వర్జినల్ గెజిట్ లిస్టు**

**ఎమ్మార్వో కార్యాలయంలో, ఇంకొక దొంగ లిస్టు డీపీ ఆర్ ఓ ఆఫీస్ లో పొందుపరిచారు, ఇది అధికారులకు కనపడదా !**

**"2023లో మానుకోట జిల్లా కేంద్రం లో బిపిఎల్ పేరున వర్కింగ్ జర్నలిస్టులు 58 మందికి నివేషణ స్థలాలు ఇచ్చిన విషయం విధితమే... 58 మందిలో 40వ సీరియల్ నెంబర్ పై తొలి సమయం దినపత్రిక ఎడిటర్ వి అయోధ్య రామయ్య కు నివేషణ స్థలం మంజూరీ అయ్యింది, ఆ పేరును అడ్డు అదుపులేకుండా సాక్షి స్టాఫ్ రిపోర్టర్ ఈరగాని బిక్షం ప్రాధాన పత్రిక ఇంఫ్లుఎన్స్‌ని అధికారులను రాజకీయ ప్రజాప్రతినిధులను, జర్నలిస్టు సంఘాలను ఉపయిగించుకొని అవినీతికి తెగబడ్డాడు,పాపం వాళ్ళకు బిక్షం అనేటోడు కంపు డ్రై నేజి గాడు అనేది తెలువదు, అదే క్రమంలో వంగి వంగి లేచి లేచి సలాం పెడుతూ, ప్రతి కాడ మొకరిల్లుతూ హుజూర్ అంటూ నక్క వినయాలతో దిగజారుడుకు పాల్పడుతూ మానుకోట లో జర్నలిస్తులకు ఇచ్చే నివేషణ స్థలాల్లో తన వక్ర బుద్దిని ప్రదర్శించాడు సీనియర్ జర్నలిస్టు పేరును గెజిట్ లిస్టులో కొట్టేసి తన పేరు పెట్టుకున్నాడు. బాధితుడు వి. అయోధ్యరామయ్య వివరాలు ఇలా ఉన్నాయి "**



HON'BLE SRI JUSTICE C.V.BHASKAR REDDY

WRIT PETITION No.4794 of 2025


ORDER:

This Writ Petition is filed questioning the action of the respondents in not considering the case of the petitioner seeking to declare the action of the respondents in not considering the representation dated 08.02.2025 and passing appropriate orders in accordance with law.

2. Heard Sri Balasani Suresh G...

**తొలి సమయం మహబూబాబాద్ ఏప్రిల్ 9:**
ఆ గెజిట్ లిస్టుకు బదులు నంగనాచి లాగా కొత్త లిస్టును తయారు చేసి డీపీఆర్ ఓ ఆఫీస్ లో భద్రపరిచాడు. లబోదిబోమని లబ్ధిదారుడు అయోధ్య రామయ్య నెత్తినోరు కొట్టుకొని ఆర్టీఐ ద్వారా ఎమ్మార్వో ఆఫీసులో గెజిట్ లిస్టును వెలికి తీసాడు.అక్కడ నుండి సాక్షి స్థాఫర్ ఈరగాని బిక్షం దొంగవేషాలు గతంలో ఎక్కడెక్కడ జర్నలిస్టు పేరున నివేషణ స్థలాలు పొందాడో కూపి లాగాడు,

సిద్దిపేట లో సాక్షి దినపత్రికలో పనిచేస్తూ 220 గజాల జాగా తీసుకున్నట్లు అధికారులకు ఆధారాలతో తెలియజేశాడు.. 2003 -04 పీరియడ్ లో డోర్నకల్ నియోజకవర్గం నర్సింహులపేట మండల కేంద్రంలో 180గజాలు తీసుకున్నాడు. అంతటితో ఆగకుండా ఖమ్మం జిల్లా కేంద్రంలో



| | | |
|---|---|---|
| 35 | AB News | |
| 36 | Jai Telangana TV | PADMAM VIKRANTH |
| 37 | Jai Telangana TV (INB News) | ALAKUNTLA SRINIVAS |
| 38 | Ma Telangana TV | KARAM JEEVAN |
| 39 | News 9 Today | CHIRRAGONI UDAYDHEER |
| 40 | TV 6 News | Vemula Ayodhya Ramulu |
| 41 | Bahujana TV News | CHATLA KIRAN KUMAR |
| 42 | Sri Maruthi Digital Cable Netw | INJAMURI VISHNU KUMAR |
| 43 | Bathukamma TV | NALLAKUNTLA KARUNAKAR |
| 44 | News 9 Today | POTHUGANTI SATHISH |
| 45 | PRASARA BHARATHI | SOMA PURUSHOTHAM |
| 46 | 6Tv | Burra Purnachander Rao |

సాక్షి స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేస్తూ అక్కడ కూడా నివేషణ స్థలం పొందినట్లు పక్కా సమాచారం అయితే అక్కడ ఆర్టిఐ వేశాడు అది కూడా ఆధారాలతో అధికారుల ముందు ఉంచడానికి,రామయ్య తీవ్ర ప్రయత్నం చేస్తున్నాడు
జరిగిన అన్యాయం తో జిల్లా కోర్టు మెట్లు ఎక్కాడు,అదే తీర్పుకాపీతో హైకోర్టుకు వెళ్ళగా సాక్షి స్టాపర్ ఈరగాని గాని బిక్షం తతంగం మొత్తంగా విచారణ జరిగింది. అతని చీటింగ్ పైన గురి కాకుండా, అన్ని అర్హతలు ఉన్న వి అయోధ్య రామయ్య కు ఎలాంటి వివరణ లేకుండా నివేషణ స్థలంతో పాటు డబుల్ బెడ్ రూమ్ సాంక్షన్ చేయాలని అధికారులకు హైకోర్టు జడ్జిమెంట్ ఆర్డర్ కాపీని పంపింది, నాలుగు వారాలు గడువు పెట్టింది, సమయం నెల దాటింది. ఇంతవరకు ఆర్డర్ కాపీ పై జిల్లా అధికారులు కలెక్టర్, ఆర్డీఓ ఎమ్మార్వో డీపీఆర్ ఓ స్పందించలేదు, కనీసం ఆర్డర్ కాపీని చదివారా అనేది కూడా అనుమానాలకు తావిస్తోంది, ఆర్డర్ కాపీ లో పెద్దగా ఏమి లేదు అంటూ నవ్వు కుంటూ, సాక్షి స్టాఫర్ మాత్రం నన్ను కోర్ట్ ఏమిచేయదు, నాకు డోర్ రిజిస్ట్రేషన్ ఒచ్చింది, నా ప్లాట్ కోసం ఎంతవరకైనా తెగిస్తాను అంటున్నాడు అని ఆరోపణలు వినపడుతున్నాయి,

ఆర్ ఐ వివరణ: సిద్దిపేట నరసింహులపేటలో రెండుసార్లు నివేషణ స్థలాన్ని పొందిన ఆదారాలు మీకు ఇచ్చాను దానిపై ఎంక్వయిరీ చేశారా అని అడగగా... సిద్దిపేటలో తీసుకున్న ప్లాట్ సరెండర్ చేశానని బుకాయిస్తున్నాడు. సరెండర్ కాపీ పెట్టమని అడిగితే వస్తాను వస్తాను అంటూ దాటవేస్తున్నాడు, మరి నరసింహులపేటలో తీసుకున్న ప్లాటు పరిస్థితి ఏమిటి అని అడగగా.. నాకు గుర్తుకులేదు అది ఎప్పుడో తీసుకున్నాను అని విచిత్రంగా మాట్లాడుతున్నాడని ఆర్ఐ కృష్ణ ప్రసాద్ వివరణ ఇచ్చారు..

హై కోర్ట్ ఆర్డర్ కాపీని అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వి. అయోధ్య రామయ్య కు న్యాయం చేసి చీటర్ సాక్షి స్టాఫర్ ఈరగాని బిక్షం పై చట్టరమైన చర్యలు తీసుకోవాలని దగా పడిన సీనియర్ జర్నలిస్టు వి అయోధ్య రామయ్య అధికారులను కోరుకుంటున్నారు. లేనిచో హై కోర్టులో న్యాయం కోసం మరొక దశకు అడుగు ముందుకేస్తాను అంటున్నాడు.

# ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలనిపూజలు

## మంత్రి కొండా సురేఖ ఆదేశాలు



**తొలి సమయం వరంగల్ మే 9**
మన భారత గడ్డ మీద పర్యాటకులను చంపిన తీవ్రవాదులను ఏరివేత లక్ష్యంగా దేశ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ - టార్గెట్ విజయవంతం అయ్యేందుకు మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖకి కీలక ఆదేశాలు భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని మన రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయంలో పూజలు చేయాలని మంత్రి కొండా సురేఖ ఆదేశాలు ఇంతటి సంక్లిష్టమైన సమయంలో భారత ఆర్మీకి మనమంతా అండగా నిలవాల్సిన సందర్భం పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" రెండో దాడి విజయవంతం అవడం హర్షించదగ్గ విషయం. కోట్లి వద్ద గుల్పూర్ ప్రాంతంలో ఉన్న లష్కరే తోయిబా నియంత్రణ కేంద్రాన్ని పూర్తిగా నాశనం చేసిన ఇండియన్ ఆర్మీ. ఉగ్ర స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని సూటిగా ప్రయోగించిన అత్యాధునిక ఆయుధాలు. దాడి దృశ్యాలను అధికారికంగా విడుదల చేసిన భారత భద్రతా సంస్థలు. ఉగ్రవాదంపై నిర్దాక్షిణ్యంగా పోరాటం కొనసాగుతుందని హెచ్చరించిన భారత ఆర్మీ బలగాలు. మన ఆర్మీ బలగాలు సరిహద్దులో పెద్ద ఎత్తున పోరాడుతున్న సమయంలో వారి క్షేమ%శీ% కోరి మనమంతా పూజలు చేయడం సందర్భాచితం. తీవ్రవాదాన్ని యావత్ భారతమంతా ఉక్కు పిడికిలితో ఎదుర్కొన్నది. ఈ సమైక్యత దేశ భద్రత విషయంలో రానున్న రోజుల్లో కూడా ఉంటుంది. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎక్కడ ఉన్నా కఠినంగా వ్యవహరించాలి. మన దేశ పౌరుల మీద ఇటీవల కాశ్మీర్ లో జరిగిన దాడికి నిరసనగా ఇండియన్ మిలటరీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్ అందరూ స్వాగతిస్తున్న తెలంగాణ మంత్రిగా కాదు, ఇంతటి గొప్ప దేశ పౌరురాలిగా, ఈ చర్యపై చాలా సంతోషంగా భావిస్తున్న. పుల్వామాలో మనం కోల్పోయిన వీర సైనికులను తిరిగి తీసుకురాలేం, వారి త్యాగం శాశ్వతం. మనమున్నంత కాలం వారిని స్మరించుకుంటాం. ఆపరేషన్ సిందూర్' ద్వారా భారత్ తలెత్తి నిలిచింది. ఏకత్వంతో, శక్తితో, నిశ్శబ్దమైన సంకల్పంతో మనలని ప్రపంచం నిలబెట్టింది. ఇది కేవలం ప్రతిస్పందన కాదు, ఒక ప్రతి సమాధానం. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో చాలా మర్యాదగా ప్రవర్తించాల్సిన అవసరం. దేశ భద్రత విషయంలో అందరినీ కలుపుకోవాలి. ఎందుకంటే, ఇది దేశానికి సంబంధించిన విషయం. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎటువంటి రాజకీయం చేయాలని అనుకోవడం లేదు. చేయదు కూడా. మేము భారత ఆర్మీకి పూర్తి మద్దతుగా ఉన్నాం.రానున్న రోజుల్లో కూడా ఉంటాం. అందుకే ఈరోజు మా రాష్ట్రంలోని ప్రతి గుడిలో దేవాలయాలో ఆర్మీకి మంచి జరగాలని పూజలు చేస్తున్నాం.

# కుడా మాజీ చైర్మన్‌ను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు



**తొలి సమయం వరంగల్ మే 9**
కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో పరమపదించగా హనుమకొండలోని తన నివాసానికి వెళ్లి,కుడా మాజీ చైర్మన్ మరియు అతని కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సిద్ధిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు పరామర్శించారు. వారి వెంట హనుమకొండ బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్,మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి,హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, మాజీ కమిషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్,బండ శ్రీనివాస్, నాయకులు బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి,బండి రజనీ కుమార్,చింతల యాదగిరి,పులి రజినీకాంత్, జోరిక రమేష్, కంజర్ల మనోజ్,బుద్ధ వెంకన్న,పొలపెల్లి రాంమూర్తి, సత్యనారాయణ,సంపత్ రెడ్డి,రమేష్, వీరస్వామి,టి జి ఎ నాయకులు డాక్టర్ మోటె చిరంజీవి,రవీందర్ రెడ్డి, సంజీవరెడ్డి,కిషన్,ప్రేమ్ సాగర్ రావు,శ్యామ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకుని పరిష్కరించుకోవాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**తొలి సమయం వరంగల్ మే 9**
భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టుగా వర్ధన్నపేట మండలం ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామంలో భూ భారతిలో భూ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులను, రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్కను పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు చట్టంపై అవగాహన కల్పించి, వారి సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం చెన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుని ఎంపికకు క్షేత్ర స్థాయిలో స్థితిగతులను పరిశీలించి నిబంధనల మేరకు అత్యంత నిరుపేదను పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయ్ సాగర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కన్నీటి పర్యంతం..

శ్రీనగర్, మే 09: భారత్, పాకిస్థాన్‌ల మధ్య జరుగుతోన్న కాల్పుల్లో అమాయక చిన్నారులతోపాటు మహిళలు మరణిస్తున్నారని జమ్మూ కశ్మీర్ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం మహబూబా ముఫ్తీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య చోటు చేసుకున్న టెన్షన్లు నివారించేందుకు రాజకీయ జోక్యం అవసరమని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల మధ్య చోటు చేసుకున్న ఈ దాడులపై తొలిసారిగా మహబూబా ముఫ్తీ స్పందించారు. శుక్రవారం శ్రీనగర్‌లో మాజీ సీఎం మహబూబా ముఫ్తీ విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో జరిగిన పుల్వామా అయినా.. పహల్గాం అయినా.. ప్రమాదం మాత్రం దేశ అంచునకు తీసుకు వెళ్లాయన్నారు. సరిహద్దు ప్రాంతంలో చిన్నారి కవలలు ఆడుకోవడం చూశానని.. అదే చిన్నారులు రక్తం మడుగులో పడి విగత జీవులుగా ఉండడాన్ని సైతం చూశాన్నారు. ఇలా విగత జీవులుగా మారుతోన్న చిన్నారులు, మహిళలకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఈ వారి మరణాలకు తప్పు ఎవరిదంటూ ఆమె నిలదీశారు. చిన్నారుల మరణంతో ఆ తల్లల ఒడి ఖాళీగా మారుతోందని.. ఇలా ఎంత కాలమంటూ మాజీ సీఎం మహబూబా ముఫ్తీ కన్నీటి పర్యంతమవుతూ ప్రశ్నించారు. ఇరువైపులా కాల్పుల వల్ల జమ్మూ కశ్మీర్ వాసులు మరణిస్తున్నారన్నారు. కాల్పులు ఇలాగే జరిగితే.. ప్రపంచం అపాయకర స్థితికి చేరుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్గిల్, పుల్వామా, పహల్గాం, పఠాన్‌కోట్ ఇలా ఏ ప్రాంతంలో నైనా... కాల్పులు ఒకటేనన్నారు. అసలు ఈ సమస్య మూలాలను తొలగించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులను ఆపాలంటూ ఇరు దేశాలకు ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. ఇరు దేశాల ప్రధానమంత్రులు ఫోన్‌లో చర్చల జరపడం ద్వారా వీటిని పరిష్కరించుకోవాలని భారత్, పాకిస్థాన్‌లకు ఆమె సూచించారు. మే 8వ తేదీన పాకిస్తాన్ సాయుధ దళాలు.. భారత్‌లోని పశ్చిమ సరిహద్దుల వెంబడి డ్రోన్లతోపాటు క్షిపణులను ప్రయోగించింది. దీంతో జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌తో పాటు గుజరాత్‌లోని అనేక పట్టణాలలో సైరన్లను సైన్యం మోగించాయి. అలాగే విద్యుత్ సరఫరాను పలు ప్రాంతాల్లో నిలిపి వేశాయి. తద్వారా పాకిస్థాన్ జరిపిన దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టామని భారత సైన్యం ప్రకటించింది. ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది మృతి చెందారు. అందుకు ప్రతీకారంగా పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసింది. అనంతరం రెండు దేశాల మధ్య ప్రస్తుతం ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఆ క్రమంలో గురువారం రాత్రి భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లోని నగరాలే లక్ష్యంగా పాకిస్థాన్ డ్రోన్లతోపాటు క్షిపణు దాడులకు దిగింది. వీటిని భారత్ తప్పికొట్టడం ద్వారా తన సత్తాను చాటింది.

# ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారులు..

## రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ

న్యూఢిల్లీ: సరిహద్దుల్లో పాక్‌తో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్రం మరిన్ని అధికారాలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడులకు దిగుతున్న పాక్ బలగాలను తిప్పిగొట్టేందుకు అవసరమైతే సరిహద్దు టెరిటోరియల్ ఆర్మీ ని రంగంలోకి దించాలని నిర్ణయించింది. ఇందులోని అధికారులు, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలిపించేందుకు భారత ఆర్మీ చీఫ్‌కు అధికారం కల్పించింది. టెరిటోరియల్ ఆర్మీ రూల్ 1948 కింద కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో రెగ్యులర్ ఆర్మీతో కలిసి టెరిటోరియల్ ఆర్మీ పనిచేస్తుంది. సైనిక రిజర్వ్ ఫోర్స్‌గా టెరిటోరియల్ ఆర్మీ పనిచేస్తుంటుంది. ప్రత్యర్థులతో తలపడేందుకు భారత్ ఆర్మీతో కలిసి పనిచేసేందుకు ఈ టెరిటోరియల్ ఆర్మీ సిద్ధంగా ఉంటుంది. రెగ్యులర్ ఆర్మీలో ఇది భాగమే అయినప్పటికీ అవసరమైన సందర్భంలోనే ఈ టెరిటోరియల్ ఆర్మీ రంగంలోకి దిగుతుంది. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో టెరిటోరియల్ ఆర్మీ సిద్ధంగా ఉంటుంది. 1962, 1965, 1971 యుద్ధాల్లోనూ భారత సైన్యంతో కలిసి టెరిటోరియల్ ఆర్మీ పనిచేసింది. రెగ్యులర్ ఆర్మీకి సెకండరీ ఫోర్స్‌గా ఉండే టెరిటోరియల్ ఆర్మీలోని సిబ్బందికి నేషనల్ ఎమర్జెన్సీ, అంతర్గత భద్రత విధులకు సంబంధించి శిక్షణ ఇస్తుంటారు. ప్రస్తుతం 32 టెరిటోరియల్ ఆర్మీ ఇన్ఫాంట్రీ బెటాలియన్స్ ఉన్నాయి.

## ఉద్రిక్త పరిస్థితుల వేళ..
## జమ్మూలో పర్యటించిన సీఎం

**న్యూఢిల్లీ, మే 09:**
భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు జమ్మూ ప్రభుత్వం తరలిస్తుంది. ప్రజలకు భోజనంతోపాటు షెల్టర్లను అధికారులు ఏర్పాటు చేశారు. అలాగే ఫుడ్, మెడికల్ క్యాంపులను అధికారులు ఏర్పాటు చేశారు. మరోవైపు నగరంలో పరిస్థితుల స్థితిగతులు తెలుసుకునేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా జమ్మూలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆయన చర్చించారు. అలాగే వారికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ఇక జమ్ము కాశ్మీర్‌లోని విద్యా సంస్థలకు సోమవారం వరకు సెలవు ప్రకటించారు. స్థానిక పరిస్థితులపై సోమవారం చర్చించి.. సెలవులు పొడిగించాలా లేదా అనే అంశంపై చర్చించి ఓ నిర్ణయానికి వస్తామని చెప్పారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకున్న నేపథ్యంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు పాఠశాలకు సెలవులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పలు నగరాల్లో సైరన్ వినిపించిన సంగతి తెలిసిందే. అక్నూర్, సాంబ, బారాముల్లా, కుప్వారా తదితర నగరాల్లో ఈ సైరన్ శబ్దం వినిపించింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా అన్ని పోర్టుల్లో భద్రతను పెంచారు. వాటి వద్ద భద్రతను రెండో లెవల్‌కు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భద్రతా పెంపు ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయన్న షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ కీలక ప్రకటన చేశారు. పోర్టులు, షిప్పులు, టర్మినల్స్‌లో భద్రతను కేంద్రం పెంచింది. ఇంకోవైపు.. శుభకార్యాలయాల్లో టాపాసులు పేల్చకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే దేశంలోని అన్ని రాష్ట్రాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అప్రమత్తం చేసింది. అవసరమైతే ముందు జాగ్రత్త చర్యలను సమర్థవంతంగా అమలు చేయడానికి పౌర రక్షణ నిబంధనల ప్రకారం.. అత్యవసర అధికారాలను ఉపయోగించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ.. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది.

## వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు!

**ఆ ఆర్మీ మహిళా అధికారుల ఎస్ఎస్‌పీ సర్వీసును ముగించొద్దు**

**తదుపరి విచారణ వరకు చర్యలు వద్దు**

**కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం**



**న్యూఢిల్లీ, మే 9:** షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ఎంపికైన మహిళా ఆర్మీ అధికారులకు శాశ్వత కమిషన్ (పీసీ) నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ప్రస్తుత పరిస్థితుల్లో' వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయొద్దంటూ పరోక్షంగా భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల గురించి ప్రస్తావించింది. 69 మంది మహిళా అధికారులు వేసిన పిటిషన్లపై తదుపరి విచారణను ఆగస్టుకు వాయిదా వేసింది. అప్పటి వరకు వారి షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎసీ) సర్వీసును ముగించి పంపించొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. 'వారు తెలివైన అధికారులు. మీరు వారి సేవలను వేరేచోట వినియోగించుకోవచ్చు. ఇది కోర్టుల చుట్టూ తిరగాల్సిన సమయం కాదు. దేశానికి సేవచేయడానికంటూ వారికి మంచి స్థానం ఉంది' అని జస్టిస్ కాంత్ పేర్కొన్నారు. కేంద్రం తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భటి వాదనలు వినిపిస్తూ.. ఇది భారత సైన్యానికి యువ అధికారులు అవసరమన్న విధానం ఆధారంగా తీసుకున్న పాలనాపరమైన నిర్ణయమని కోర్టుకు తెలిపారు. షార్ట్ సర్వీస్ కమిషన్ సర్వీసును ముగించి, ఆ మహిళా అధికారులను పంపించడంపై ఎలాంటి స్టే ఇవ్వొద్దని కోరారు.

## పాక్ ఆకాశ నేత్రం నేలమట్టం

**'అవాక్స్'ను కూల్చివేసిన భారత సైన్యం**

**వైమానిక రాడార్ వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ**

**న్యూఢిల్లీ, మే 9:** భారత్‌లోని 15 నగరాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్ చేసిన దాడి ప్రయత్నాలను భారత సైన్యం సమర్థవంతంగా భగ్నం చేసింది. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ధ్వంసం చేయడమే కాకుండా.. ఆ దేశానికి అత్యంత కీలకమైన ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (అవాక్స్)ను కూడా కూల్చివేసింది. ఆకాశ నేత్రంగా పిలిచే అవాక్స్ అనేది ఒక వైమానిక రాడార్ వ్యవస్థ. రాత్రివేళ దాడి కోసం పాక్ దీన్ని యాక్టివేట్ చేసింది. ముందే గుర్తించిన భారత్... పంజాబ్ ప్రావిన్స్‌లో దాన్ని కూల్చివేసింది. ఇది పాక్‌కు కోలుకోలేని ఎదురుదెబ్బే. ఎందుకంటే ఈ విమానం ఓ సాధారణ రాడార్ కాదు. శత్రు విమానాలు, క్షిపణుల కదలికలపై నిఘా పెట్టి, కీలక సమాచారం అందించే ఆకాశ నేత్రం. ఇలాంటి వ్యవస్థ నాశనం కావడమంటే పాక్ వైమానిక వ్యూహం అర్ధంతరంగా నిలిచిపోవడమే. పాకిస్థాన్ వద్ద మొత్తం 9 అవాక్స్ విమానాలున్నాయి.

## జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణ
# ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి



**తొలి సమయం వరంగల్ మే 9**
హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధిలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు ఇప్పటి వరకు చేపట్టిన భూసేకరణ, ఇంకా చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ, రైతులకు పరిహారం చెల్లింపు, తదితర అంశాలపై సమీక్షహనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధి గుండా వెళ్తున్న 163జి గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధిలో జాతీయ రహదారి 163జి, పురోగతి పై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, సీజీఎం ఆర్వో శివశంకర్, వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యా రాణి లతో కలిసి జాతీయ రహదారులు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులతో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ లో మంచిర్యాల నుండి భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల మీదుగా ఖమ్మం నుండి విజయవాడ వరకూ (నాగపూర్ -విజయవాడ) నిర్మించే 163జి గ్రీన్ ఫీల్డ్ ఎకానమిక్ కారిడార్ లో భాగంగా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియ, రైతులకు పరిహారం చెల్లింపులు, తదితర అంశాలపై జాతీయ రహదారుల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన మాట్లాడుతూ రెండో దశ ప్రాజెక్ట్ లో భాగంగా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి పరిధిలో జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ను త్వరగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణ కింద భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సరస్వతి పుష్కరాల తరువాత భూసేకరణ పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. భూసేకరణ పెండింగ్ లో ఉన్న ప్రాంతాల రైతులతో ఆర్బిట్రేషన్ నిర్వహించి పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. భూసేకరణలో భాగంగా రైతులతో అధికారులు మాట్లాడి పరిహారం చెల్లించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల శాఖ వరంగల్, ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్లు దుర్గాప్రసాద్, దివ్య, ఆర్ అండ్ బీ ఎస్ ఈ నాగేంద్ర రావు, ఈఈ సురేష్ బాబు, ఆర్డీవోలు ఎన్. రవి, ఉమారాణి, సత్యపాల్ రెడ్డి రాథోడ్ రమేష్, నారాయణ, తహసీల్దార్లు, జాతీయ రహదారుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధిపై
# ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం

**తొలి సమయం వరంగల్ మే 9**
హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే గారి నివాసంలో స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధిపై మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ని సుందరమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అంశాల వారీగా చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో వ్యర్థల సేకరణ, నిర్వహణ పకడ్బంది చేయాలని అన్నారు. చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోలు, చెత్త కుండీల ఏర్పాటు, డ్రైనేజీ క్లినింగ్, పారిశుధ్య కార్మికుల నియామకం వంటివి వేంటేనే చేపట్టాలని సూచించారు.త్రాగు నీటి సరఫరాకు సంబందించి ప్రస్తుతం ఉన్న వాటర్ ట్యాంక్ లు ఎన్ని అదనంగా ఎన్ని అవసరం ఉన్నాయో వాటికీ సంబందించిన అంచనాలు సిద్ధం చేయాలని, అలాగే అంతర్గత పైప్ లైన్లను వచ్చే 10ఏళ్లకు 50వేల జనాభా అవసరాలకు సరిపడే విధంగా ఉండాలని తెలిపారు. అవసరమైతే ఘనపూర్ రిజర్వాయర్ నుండి నీటిని వాడుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. మున్సిపాలిటీలో ఎక్కడా విద్యుత్ సమస్యలు లేకుండా విద్యుత్ నిర్వహణ ఉండాలని అన్నారు.

ప్రతీ కాలనిలో స్ట్రీట్ లైటింగ్, అవసరం ఉన్న చోట పోల్స్ ఏర్పాటు చేయడం, ప్రతీ ఇంటికి మీటర్లు ఏర్పాటు చేయడం, కూడళ్ళలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయడం, విద్యుత్ అంతరాయం కలగకుండా డీటీఆర్లు, కండక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఘనపూర్, శివునిపల్లి, చాగల్ మూడు గ్రామాలలో బీటి రోడ్లు, అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లకు గ్రామాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ఎక్కడా కూడా వర్షపు నిలవకుండా ఉంచడంతో పాటు మురుగు నీటి కాలువల ఏర్పాటుకు సంబందించి ఔటింగ్ లేవల్స్ చూసి ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అవసరం ఉన్న చోట రోడ్డు విస్తరణ చేపట్టాలని తెలిపారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కాబట్టి పరిపాలన సౌలభ్యానికి అవసరం అయిన భవన సముదయాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని



అన్నారు అందుకు కావాల్సిన స్థలాన్ని గుర్తించాలని అన్నారు. మున్సిపల్ కార్యాలయం, మీటింగ్ హల్, టౌన్ హల్, గెస్ట్ హౌస్ వంటివి నిర్మించుకోవాల్సి ఉందని అన్నారు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలని అన్నారు. అందుకు సంబందించి తొర్రురు, మహాబాబూబాద్ మార్కెట్లను పరిశీలించాలని సూచించారు.మున్సిపాలిటీ పరిధిలోని మూడు గ్రామాలలో స్మశాన వాటికలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ పట్టణంలో అనువైన స్థలాలలో పార్కులు అభివృద్ధి చేయాలని సూచించారు. దేవాదుల రిజర్వాయర్ దగ్గర అద్భుతమైన థిమ్ పార్క్ అభివృద్ధి చేయాలని అన్నారు. పట్టణంలో ప్రధాన కూడళ్లను సుందరికణ చేయాలని, అలాగే ప్రధాన రహదారులను వెడల్పు చేయాలని అన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన పనులకు సంబందించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికిపంపాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, స్థానిక నాయకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బలూచిస్థాన్ రెబెల్స్ వశం

**పాక్ సైన్యంపై వరుసగా తిరుగుబాటుదారుల దాడులు**

**కీలక నగరం క్వెట్టా సహా చాలా భాగం మూడు రెబెల్ గ్రూపుల స్వాధీనం!**

**మరోవైపు దాడులకు దిగిన టీటీపీ**

**20 మంది పాకిస్థాన్ సైనికులు హతం**

**న్యూఢిల్లీ, మే 9:** పాకిస్థాన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు ఆ ప్రాంతాన్ని తమ వశం చేసుకున్నారు. ఓవైపు భారత్‌పై డ్రోన్లు, క్షిపణి దాడులకు పాక్ తెగబడుతున్న సమయంలో... బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) సహా మూడు తిరుగుబాటు గ్రూపులు అక్కడి పాక్ సైనిక స్థావరాలపై దాడులకు దిగాయి. క్వెట్టాలోని ఫైజాబాద్ ప్రాంతంలో పాక్ దళాలు, తిరుగుబాటు దారుల మధ్య తీవ్ర స్థాయిలో కాల్పులు జరిగాయి. సిబ్బిలోని మిలటరీ క్యాంపుపై తిరుగుబాటుదారులు గ్రనేడ్లతో దాడికి దిగారు.

పాకిస్థాన్ ఆర్మీని తరిమికొడుతూ, అక్కడి కీలక నగరం క్వెట్టా సహా చాలా ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఆరు ప్రాంతాల్లో పాక్ దళాలపై ఐఈడీలు, గ్రనేడ్లు, ఆటోమేటిక్ ఆయుధాలతో దాడులు చేశామని బీఎల్ఏ అధికార ప్రతినిధి జియాంద్ బలూచ్ ప్రకటించారు. మరోవైపు క్వెట్టాలో, ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, ఇతర ప్రాంతాల్లో పాకిస్థాన్ జెండాలను తొలగించి.. బలూచిస్థాన్ జెండాలను ఎగురవేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**దెబ్బ మీద దెబ్బ**
పాకిస్థాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. తెహ్రిక్ ఈ తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) తీవ్రవాదులు చేసిన దాడిలో పాకిస్థాన్‌కు చెందిన 20 మంది సైనికులు హతమయ్యారు. పాకిస్థాన్, దక్షిణ వజిరిస్థాన్‌లోని షకాయి సబ్ డివిజన్‌లో ఉన్న ఓ మిలటరీ ఔట్‌పోస్టుపై గురువారం అర్ధరాత్రి తర్వాత ఈ దాడి జరిగినట్టు రిపబ్లిక్ వరల్డ్ సంస్థ ఓ కథనంలో పేర్కొంది. లేజర్ రైఫిల్స్ ఉపయోగించి టీటీపీ చేసిన తొలి దాడిలో ఆరుగురు పాక్ సైనికులు మరణించారు.

మిలటరీ ఔట్‌పోస్టు రక్షణకు బయలుదేరిన రెండు సైనిక వాహనాలపైనా టీటీపీ దాడి చేసింది. మొత్తంగా 20 మంది పాక్ సైనికులు మరణించారని, ఐదుగురు గాయపడ్డారని టీటీపీ ప్రకటించింది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101